క్లుప్తంగా

కాంపోనెంట్స్ బ్లడ్ బ్యాంకుగా తీర్చిదిద్దేందుకు కృషి



రేపల్లె : రేపల్లె బ్లడ్ బ్యాంకును కాంపోనెంట్స్ బ్లడ్ బ్యాంకుగా రూపొందించడానికి కృషి చేస్తానని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ యార్లగడ్డ రామారావు అన్నారు. రేపల్లె బ్లడ్ బ్యాంకును మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. బ్లడ్ బ్యాంక్ ఆశాజనకంగా ఉందన్నారు. బ్లడ్ బ్యాంకులో రక్త సేకరణను పెంచాలన్నారు. బ్లడ్ బ్యాంకు అభివృద్ధికి కావాల్సిన నిధులను సమకూర్చడంతో పాటు న్యాక్టో ఫార్మసీ సహకారంతో రేపల్లె బ్లడ్ బ్యాంకును కాంపోనెంట్స్ బ్లడ్ బ్యాంకుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రామారావును రేపల్లె బ్లడ్ బ్యాంకు చైర్మన్ డాక్టర్ వసంత వీర రాఘవయ్య ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు కరిముల్లా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రూ.పది వేలు పెన్షన్ ఇవ్వాలి

తాడేపల్లి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో 60 సంవత్సరాలు నిండిన పేదలకు రూ.వేలు పెన్షన్‌గా అందజేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు ఈ నెల 20వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతన చట్టం ప్రకారం కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని అన్నారు. విద్యుత్ చట్ట సంస్కరణలను ఎత్తివేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగు సమ్మెలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేలా కేంద్రం వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు పల్లెకృష్ణ, రైతు సంఘం మంగళగిరి మండల నాయకులు ఎం.పకీరయ్య, గ్రామ నాయకులు బొప్పన గోపాలరావు, డోకిపర్తి రాజేంద్రబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పరిమిశెట్టి శివనాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు పల్లపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

కోర్టుల తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులతో కలిసి సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల ముందు నారా లోకేష్ ఇక్కడి కార్మికుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీని నిలబెట్టుకుని చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, బి.నవనీతం, ఇమాంబి, గురవయ్య, దానయ్య, హగ్గయ్య, దుర్గాభవాని, సూర్యప్రకాశరావు, శారద, ఎం.సుబ్బారావు, శివకుమారి పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి విగ్రహం తొలగింపు

ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి గ్రామంలోని వీరాంజనేయస్వామి విగ్రహానికి మంగళవారం వేదపండితులు కళాపకర్షణ కార్యక్రమం నిర్వహించినట్లు దేవదాయ శాఖ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. రెవెన్యూ, పోలీసు, దేవదాయ శాఖల అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో విగ్రహానికి విశేషపూజలు, కళాపకర్షణ కార్యక్రమాలను వేదపండితులు భరద్వాజ్ నిర్వహించారు. నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఈ నెల 31న నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారి శ్రీనివాస్, ఎస్ఐ పి.జాన్ ఖాన్, వీఆర్వో బ్రహ్మయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

మంగళగిరి: విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మంగళగిరి పరిధిలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సీహెచ్ వెంకటేశ్వరరావు, జే సంజీవరావుల ఆధ్వర్యంలో 46 మంది అధికారులు, 189 మంది మొత్తం 46 బృందాలుగా ఏర్పడ్డారు. 3,121 సర్వీసులను తనిఖీ చేశారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ 0.53 లక్షలు, అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతరాల్లో విద్యుత్ వాడుకుంటున్న 9 మందికి రూ 1.20 లక్షలు, అనుమతించిన లోడు కంటే అదనంగా వాడుకుంటున్న 124 మందికి రూ 10.37 లక్షలు కలిపి మొత్తం రూ.12.10 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. తొలిసారి విద్యుత్ చౌర్యం చేస్తే కాంపౌండింగ్ పద్ధతిలో జరిమానా విధించడం జరుగుతుందని, రెండో సారి పాల్పడితే అరెస్ట్ చేయిస్తామన్నారు. విద్యుత్ శాఖ అధికారులు కె.రవికుమార్, జి.సురేష్‌బాబు, ఎం.సతీష్‌కుమార్, యు. శివశంకర్, వి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పొట్ట నింపని చేపల వేట

- రోజంతా వేటాడినా రూ.200 రాని వైనం
- అరకొరగా మత్స్యకార భృతి
- పట్టించుకోని అధికారులు, ప్రభుత్వం

బాపట్ల: ఎగసిపడే కెరటాలకు ఎదురొడ్డి జీవనం సాగించే మత్స్యకారుల జీవితాల్లో చీకట్లు కమ్ముకున్నాయి. రేయనకా.. పగలనకా.. కష్టపడి వేటాడినా కనీసం రోజుకు రూ.200 కూడా రాకపోవడంతో కుటుంబాన్ని ఏ విధంగా పోషించుకోవాలో తెలియక మత్స్యకారులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. రోజంతా వేటాడినా పొట్ట నింపడం లేదని మ్త్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

▪ గతంలో పడవలతో సముద్రంలోకి వెళ్లి వారం రోజుల పాటు వేటాడుకొని వచ్చిన సొమ్ముతో జీవనం సాగించుకునే వారు. ప్రస్తుతం వేట నిషేధ సమయం కావడంతో సముద్రంలో ఎవరైనా బోటులతో వేటాడితే బోటులు సీజ్ చేస్తాం.. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని మత్స్య శాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో మత్స్యకారులు సముద్రంలో వేటలు సాగించడం నిలుపుదల చేశారు. అయితే మత్స్యకారులకు చేపల వేట తప్ప మరోపని తెలియదు. తరతరాలుగా వారంతా చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

సంప్రదాయ వేటే ఆధారం

ప్రస్తుతం వేట నిషేధ సమయం కావడంతో కుటుంబాన్ని పోషించుకునేందుకు మరోదారి లేక సంప్రదాయ వేటే ఆధారంగా మారింది. వలలు తీసుకొని రాత్రి 12 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కాలువల్లో తిరుగుతూ వేట సాగించి వలలో పడిన చేపలను తీసుకొచ్చి గ్రామాల్లో విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజంతా కష్టపడినప్పటికీ కనీసం రూ.200 కూడా రాకపోవడంతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో తెలియక మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నాగరాజు కాలువలో చేపలవేట సాగిస్తున్న మత్స్యకారులు

ఏడాదిగా సరిగ్గా సాగని వేట

ఏడాదిగా వేటలు సరిగ్గా సాగకపోవడం, రోజంతా కష్టపడినా కనీసం ఖర్చులకు కూడా డబ్బులు రాకపోవడంతో మత్స్యకారులకు కుటుంబ పోషణ భారంగా మారింది. ఇంటి వద్ద ఆకలితో అలమటిస్తున్న చిన్నారుల ఇబ్బందులు చూడలేక అప్పోసప్పో చేసి ఇల్లు గడుపుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇంత జరుగుతున్నా ప్రభుత్వాధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. వేట నిషేధ సమయంలో సముద్రంలో వేటకు వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. కానీ వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించాల్సిన మత్స్యకార భృతి అరకొరగానే అందించారు. ప్రభుత్వం వేట నిషేధ సమయంలో అందించాల్సిన మత్స్యకార భృతి సరిగా అందించక ఇబ్బందులు పడుతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు. దీంతో వారు పడుతున్న ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలి



మాట్లాడుతున్న ఏవో సుమంత్‌కుమార్

కర్లపాలెం: కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులు పొందాలని ఏవో సుమంత్‌కుమార్ తెలిపారు. కర్లపాలెం మండలంలోని యాజలి, బుద్దాం, దుండివారిపాలెం, దమ్మనవారిపాలెం, గ్రామాలలో మంగళవారం వ్యవసాయాధికారులు కౌలు గుర్తింపు కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు రెవెన్యూ అధికారుల సహకారంతో కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. గుర్తింపు కార్డులు కావలసిన రైతులు తాము సాగు చేస్తున్న భూమి పాస్ పుస్తకము జిరాక్స్, కౌలుదారుని ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఫోన్ నంబరు గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేయాల్సి ఉంటుందని చెప్పారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వటం వలన భూ యజమానులకు ఎలాంటి నష్టం వాటిల్లదని కౌలు రైతుకు సాగు చేసిన పంటపై మాత్రమే హక్కు ఉంటుందని ఏవో తెలిపారు. కౌలు గుర్తింపు కార్డు ఉంటే పంట నమోదు, బీమా, పంట నష్ట పరిహారం కనీస మద్దతు ధర పొందేందుకు వీలు కలుగుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, వీఆర్వో యశ్వంతి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘ నాయకులు

చెరుకుపల్లి: కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చెయ్యాలని ఏఐటీయూసీ జిల్లా సమితి నాయకులు బండారు శ్రీనివాసరావు, మరివాడ వెంకటరావు పిలుపునిచ్చారు. మంగళవారం చెరుకుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడులను తీసుకొచ్చి కార్మికులను బానిసలుగా మార్చాలన్న విధానాలను తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే ఇప్పుడు ఉన్న అనేక హక్కులను కార్మికులు, ఉద్యోగులు కోల్పోవాల్సి ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేందుకే దొడ్డిదారిన లేబర్ కోడ్‌లను తీసుకొస్తుందన్నారు. దీనివల్ల పనిగంటల భారం పెరగటంతో పాటు సమస్యల పరిష్కారం కోసం పోరాడే హక్కు కార్మికులకు లేకుండా పోతుందన్నారు. కార్మికుల డిమాండ్ల కోసం జరిగే సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టిముక్కల బాలాజీ, కార్మిక సంఘాల నాయకులు కె.వెంకటరమణ, కె.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతోనే అధిక దిగుబడులు సాధ్యం

విస్తరణ విభాగ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ



మాట్లాడుతున్న విస్తరణ విభాగం సంచాలకులు డాక్టర్ శివన్నారాయణ

బాపట్లటౌన్: పచ్చిరొట్ట పైర్లతోనే అధిక దిగుబడులు సాధ్యమని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ విభాగం సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ తెలిపారు. మంగళవారం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం బాపట్ల, గ్రామీణ అవగాహన పని అనుభవ కార్యక్రమం విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో కర్లపాలెం మండలం నల్లమోతు వారిపాలెం గ్రామంలో రైతు సదస్సు నిర్వహించారు. శివన్నారాయణ మాట్లాడుతూ రైతులు వేసవి కాలంలో భూసార పరీక్షలు చేయించుకుని, అవకాశం ఉన్న రైతులు ఖరీఫ్ ముందు పచ్చిరొట్ట పంటలు వేసుకోవటం వలన దిగుబడి శాతాన్ని పెంచవచ్చన్నారు. గ్రామీణ అవగాహన పని అనుభవం కార్యక్రమ విద్యార్థులు రైతుల దగ్గర రైతు యాజమాన్య పద్ధతులు నేర్చుకుని ఉన్నత స్థానాలకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ కదిరి బాబురావు, బాపట్ల ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరన్నగౌడ్, విస్తరణ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.బాల మురళీధర్ నాయక్, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఉష, ఏడీఏలు లక్ష్మి, ప్రవీణ, కర్లపాలెం ఎంఏవో సుమంత్ పాల్గొన్నారు.

బ్యాంకుల పనితీరుపై అవగాహన ముఖ్యం

తాడికొండ: బ్యాంకు నిబంధనలు, పథకాలపై అవగాహన తప్పనిసరి అని సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సంస్థ రీసోర్స్ పర్సన్‌లు ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌ఎస్ శంకరరావు అన్నారు. మంగళవారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖాతాదారుల అవగాహన వర్క్‌షాప్‌నకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏపీఎం సాంబశివరావు మాట్లాడుతూ మహిళలు ఆర్బీఐ కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. అనంతరం రీసోర్స్ పర్సన్‌లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థకో ఆర్డినేటర్లు షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

పదవ తరగతి సీబీఎస్ఈలో నూరు శాతం ఉత్తీర్ణత

పొన్నపల్లి ఇంటర్‌నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



కొక్కిలిగడ్డ నేహ (96.4 శాతం)

చెరుకుపల్లి: పదవ తరగతి సీబీఎస్ఈలో నూరు శాతం ఫలితాలు సాధించటం అభినందనీయమని పొన్నపల్లి ఇంటర్‌నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ పైనం ఏడుకొండల రెడ్డి పేర్కొన్నారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కొండలరెడ్డి మాట్లాడుతూ ఇంటర్‌నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 52 మంది విద్యార్థులకు గాను 52 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అందులో కొక్కిలిగడ్డ నేహ 96.4, ఏడుగురు విద్యార్థులు 90 శాతం మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సాయి రంగారెడ్డి, ఏఓ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాకపోకల సమస్యలపై డీపీవో పరిశీలన



పరిశీలిస్తున్న డీపీవో సాయికుమార్, డీఎల్‌పీవో స్వరూపారాణి తదితరులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో రైతులకు, ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యానికి మధ్య ఏర్పడిన స్థల వివాదంపై మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్ పరిశీలన చేశారు. నారాకోడూరులోని సెయింట్ మేరీస్ ఇంజినీరింగ్ కళాశాల పక్కన రైతుల పొలాలకు వెళ్లేందుకు డొంక పోరంబోకు బళ్లబాట ఉంది. దీనిపై రైతులకు, కళాశాల యాజమాన్యానికి మధ్య కొంతకాలంగా వివాదం జరుగుతోంది. సర్వే చేసిన అనంతరం రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. దీని నిమిత్తం సమస్యలను తెలుసుకునేందుకు క్షేత్ర పరిశీలన చేశారు. రెండు రోజుల్లో ఇరువర్గాల వారితో మాట్లాడి నివేదికను అందజేయాలని తెనాలి డీఎల్‌పీవో స్వరూపారాణిని డీపీవో సాయికుమార్ ఆదేశించారు. కార్యక్రమంలో చేబ్రోలు పీఎస్ కె. శ్రీనివాసరావు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వేసవిశిక్షణలో భాగంగా 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన పలు పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు చదివే విధానం, ఎటువంటి అంశాలుతో కూడినవి చదవాలి వంటి వాటిపై ఉపాధ్యాయుడు రాజు తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో పలు పుస్తకాలను చదివించారు. పుస్తకాలు చదవడం వల్ల మేలు జరుగుతుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి పి.జేమ్స్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పెద్దింటమ్మ కొలుపులు



విద్యుత్ దీపాల అలంకరణలో పెద్దింటమ్మ ఆలయం



నల్లమోతువారిపాలెం పెద్దింటమ్మ అమ్మవారు



పాతనందాయపాలెం పోలేరమ్మ అమ్మవారు

కర్లపాలెం: మండల పరిధిలోని నల్లమోతువారిపాలెంలో వేంచేసియున్న గ్రామ దేవత పెద్దింటమ్మ అమ్మవారి వార్షిక కొలుపులు బుధవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. కొలుపులలో భాగంగా 18వ తేదీన అమ్మవారి తిరునాళ్ల కనుల పండువగా జరగనున్నదని ఆలయం వద్ద విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 19వ తేదీన పోతురాజుస్వామి కొలుపులు నిర్వహిస్తామని తెలియజేశారు.

పోలేరమ్మ కొలుపులు...

మండల పరిధిలో పాతనందాయపాలెం గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి కొలుపులు ఈ నెల 15 నుంచి 19 వరకు జరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. 15వ తేదీన అమ్మవారికి జలబిందెలతో అభిషేకం, 16న మల్లెపూలతో ప్రత్యేక పూజలు, 17న అమ్మవారికి పసుపు, కుంకుమల సమర్పణ, 18న అమ్మవారి తిరునాళ్ల, అన్నదాన కార్యక్రమం, 19న భక్తులు నైవేద్యాలు సమర్పించటంతో కొలుపులు ముగుస్తాయని తెలిపారు.

తమ్ముళ్ల తవ్వకం.. మట్టి మాయం!

అధికారం ఉంది.. ఇక అడిగేదెవరు.. అన్నట్లుంది కూటమి నేతల తీరు. అక్రమాలకు, అరాచకాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ఆదాయమే పరమావధిగా ఇష్టం వచ్చినట్లు అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. లారీల కొద్దీ మట్టిని అక్రమంగా తరలించి జేబులు నింపుకొంటున్నారు. ఎవరైనా అడ్డుకుంటే అంతే సంగతులు అన్నట్లు ప్రవర్తిస్తున్నారు.

- విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు
- కనీసం పట్టించుకోని అధికారులు
- ప్రజాధనం లూటీ చేస్తున్న కూటమి నేతలు
- వాహనాల రద్దీతో ప్రజలకు తప్పని అవస్థలు



లారీలలో తరలిస్తున్న మట్టి

గుంటూరు రూరల్: కాకుమాను మండలంలోని కాకుమాను, బీకే పాలెం గ్రామాల మధ్య అక్రమ మైనింగ్‌ను విచ్చలవిడిగా సాగిస్తున్నారని స్థానిక గ్రామాల ప్రజలు వాపోతున్నారు. భారీ యంత్రాలతో మట్టి తవ్వకాలు చేస్తూ ప్రతి రోజు వందల సంఖ్యలో లారీలలో తరలిస్తున్నారని అంటున్నారు. కనీసం రైతులు తమ పొలాల్లో మట్టిని తవ్వుకోవాలంటే అధికారులు సవాలక్ష నిబంధనలు విధిస్తుంటారు. అనుమతులు, పత్రాలు అంటూ విసిగిస్తారు. కానీ నేడు అధికార పార్టీ నేతలు ఎక్కడపడితే అక్కడ తవ్వుకుని బహిరంగంగానే విక్రయించి సొమ్ము చేసుకుంటున్నా ఒక్కరూ స్పందించకపోవడంపై గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు. అక్రమంగా మట్టిని తరలించి ఒక్కో లారీ లోడు రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు విక్రయిస్తున్నారని చెబుతున్నారు. నిత్యం రూ. లక్షల్లో సొమ్ము చేసుకునే అక్రమార్కుల వైపు మైనింగ్ అధికారులుగానీ, విజిలెన్స్ యంత్రాంగంగానీ, రెవెన్యూ అధికారులుగానీ ఎందుకు పట్టించుకోవటం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నంబరు ప్లేట్లు లేకుండానే...

మట్టితో ప్రయాణించే లారీలు, టిప్పర్లు అతివేగంగా గ్రామాల మధ్య నుంచి భారీ స్థాయిలో రాకపోకలు సాగిస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారుల్లోకి రావాలంటే సాధ్యపనడి రీతిలో వాహనాల రద్దీ పెరిగిందని వాపోతున్నారు. లారీల భయంతో కనీసం బయటకు కూడా రాలేకపోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తరలించే టిప్పర్లకు కనీసం నంబర్ ప్లేట్లు కూడా ఉండటం లేదని, చూడాలంటే కనిపించనంత వేగంగా వెళుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రకృతి వనరులను కొల్లగొట్టే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఊళ్లలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని పేర్కొంటున్నారు. అటు ప్రభుత్వ ధనాన్ని, ఇటు తమను కాపాడాలని కోరుతున్నారు.

రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ



పొన్నూరు: మండల పరిధి దొప్పలపూడి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం వ్యవసాయ శాఖ రాయితీపై ఇచ్చే పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఏ వి. రామకోటేశ్వరి మాట్లాడుతూ పంట భూమిలోని సారాన్ని పెంచే క్రమంలో మండలంలోని పలు గ్రామాలకు 50 శాతం రాయితీతో 58 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు, 40 క్వింటాళ్ల జనుము విత్తనాలను రైతులకు అందించనున్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రంలో తీసుకోవాలని అన్నదాతలకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ డేగల వెంకట్రామయ్య, సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు. అయితే ప్రొటోకాల్ ప్రకారం ప్రభుత్వ సంబంధిత కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులతో ప్రారంభించాల్సి ఉండగా వారిని విస్మరిస్తూ, కూటమి నేతలకే ప్రాధాన్యమిస్తున్న వ్యవసాయ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మురుగు కాలువలలో పూడిక తీత

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రత్నాల చెరువు మురుగు కాలువలలో పూడిక తీత పనులు మంగళవారం ప్రారంభించారు. మురుగు కాలువలలో చెత్త పేరుకుపోయి ప్రవాహం సజావుగా సాగని ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో చెత్త పేరుకుపోవడంతో ఈ పనులు చేపట్టినట్లు వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎక్కడైనా మురుగు నీరు నిలిస్తే వెంటనే సంబంధిత సచివాలయంలోని పారిశుద్ధ్య సిబ్బందికి తెలియజేయాలని ప్రజలను కోరారు.


నేటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు



కొత్తరెడ్డిపాలెంలోని ప్రసన్నాంజనేయస్వామి

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 14 నుంచి 22వ తేదీ వరకు హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గాదె వీరారెడ్డి మంగళవారం తెలిపారు. కొత్తరెడ్డిపాలెం కేసీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంనందు మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 14వ తేదీన స్వామి వారికి 108 కలశములతో జలాభిషేకం, 15న సింధూరాభిషేకం, 16న పుష్పాభిషేకం, 17న హిరణ్యాభిషేకము, 18న అన్నాభిషేకం, 19న సుగంధ ద్రవ్యములతో అభిషేకములు, 20న పంచామృతాభిషేకములు, 21న లక్ష నాగవల్లీ దళాలతో పూజ, 22న స్వామి వారికి విశేషాభిషేకములు, వివిధ హోమాలు జరుగుతాయి. 22న అన్న సంతర్పణ, స్వామి వారి ఊరేగింపు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 14 నుంచి 21వ తేదీ వరకు చేబ్రోలు, మంచాల, కొత్తరెడ్డిపాలెం, గుండవరం, శలపాడు, కోవెలమూడి, గ్రామాలకు చెందిన భక్త సమాజములచే భజన కార్యక్రమాలు జరుగుతాయని గాదె వీరారెడ్డి తెలిపారు.

బియ్యం బ్యాగ్ తూకం కచ్చితంగా ఉండాలి



నెహ్రూ నగర్: బియ్యం బ్యాగ్ తూకం విషయంలో కచ్చితత్వం పాటించాలని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎం.ఎస్.ఎస్ మాధురి సూచించారు. నగరంలోని గుంటూరు మోడ్రన్ రైస్ మిల్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లీగల్ మెట్రాలజీ ప్యాకేజ్డ్ కమోడిటీస్ రూల్స్ ప్రకారం ప్రతి రైస్ బ్యాగ్ పై డిక్లరేషన్(తయారీ తేదీ, కంపెనీ వివరాలు) తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ఎవరైతే రైస్ ప్యాక్ చేస్తున్నారో వారు తప్పనిసరిగా లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా ప్యాకర్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కాటాలో తేడాల్లేకుండా చూసుకోవాలని తప్పనిసరిగా డిపార్ట్మెంటు నుంచి స్టాంపింగ్ వేయించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్ షాలెం రాజు, అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్ రాజు పాల్గొన్నారు.